# పరిపాలనా భాషగా తెలుగు అమలులో - సమస్యలు - పరిష్కారాలు

డాక్టర్ పప్పల వెంకటరమణ
తెలుగు విభాగాధిపతి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)
శ్రీకాకుళం.
చరవాణి: **9491811710**
ఈమెయిల్: ramanapappala1@gmail.com

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి అన్నది మన నమ్మకం. కన్నతల్లి, జన్మభూమి తరువాత మనలను అదే రీతిలో అలరించేదీ, అభిమానించేది మన మాతృభాష. మాతృభాష మనకు జన్మతః సంక్రమిస్తుంది. మనం పుట్టి పెరిగేది, మన అనుబంధాలను పెంచుకునేదీ, తొలి రోజుల్లో మనకు విజ్ఞానాన్ని అందించేదీ మన మాతృభాషే.

"మనమంతా తెలుగు వాళ్ళం, తెలుగు మన మాతృభాష.

భారతదేశంలోని మిగిలిన అన్ని భాషల కంటే అందమైన అక్షరాలు గల భాష మనది. మనదేశంలోని అత్యంత ప్రాచీనమైన భాషల్లో ఇదొకటి. ప్రపంచంలో పదహారవ స్థానమును, భారతదేశంలో ప్రస్తుతం మూడవ స్థానమును కలిగినటువంటి భాష మన తెలుగు భాష. గొప్ప సాహిత్య సంపదలను వారసత్వంగా అందించిన భాష ఇది. కర్ణాటకాంధ్ర సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు "దేశభాషలందు తెలుగు లెస్స" అన్నాడు. మన పొరుగు భాషా కవి తమిలుడైన భారతి దీనిని "సుందర తెలుగు" అని పేర్కొన్నాడు. పాశ్చ్యాత్యులు తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని గౌరవించారు. అది మన ఖ్యాతి, మనకున్న గౌరవం.

మనసులోని భావాలను వ్యక్తీకరించడానికి ఉపకరించే అత్యుత్తమ సాధనం భాష. పశుపక్షాదుల నుండి వేరుపడి సృష్టిలోని జీవరాసులన్నింటిలోనూ ఉన్నతమైన జీవిగా నిలబడటానికి భగవంతుడు మనకు ఇచ్చిన వరం భాష. ప్రపంచంలో అనేక భాషలు వాడుకలో ఉన్నాయి. ఏ భాష అయినా నిత్య వ్యవహారంలో లేకపోతే ఉనికిని కోల్పోయి అంతరించే ప్రమాదం ఉంది. ఒకప్పుడు వాడుకలో ఉండి ప్రస్తుతం అంతరించిపోయిన భాషలు అనేకం ఉన్నాయి. ఇటీవల యునెస్కో వారి అంచనాలను బట్టి తెలుగు భాషను కూడా అట్టి జాబితాలో చేర్చబడినది. కాబట్టి ఎవరి మాతృభాషను వారు పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

మనిషి తాను పుట్టి పెరిగిన వాతావరణంలో, వాడుకలో ఉన్నది, తన ఆలోచనలను, అభిప్రాయాలను, భావాలను వ్యక్తీకరించడానికి, ఉగ్గుపాలతో వంట పట్టించుకునేది మాతృభాష. తన అనుభూతులను, భావావేశాలను తన మాతృభాషలో వ్యక్తీకరించినట్లుగా ఇతర భాషలో వ్యక్తీకరించడం ఎవరికైనా కష్ట సాధ్యం. ఇతర భాషలు ఎన్ని నేర్చుకుని, ఎంత పాండిత్యాన్ని సంపాదించినా మాతృభాషలో వ్యక్తీకరించినట్లుగా మనసులోని అనుభూతులను యధాతధంగా మనస్సును తాకే విధంగా ఎవరు కూడా వ్యక్తీకరించలేరు.

"మాతృభాష తల్లి వంటిది, పరాయి భాష ప్రియురాలి వంటిది"

తెలుగు వారికి తెలుగు భాష మీద అభిమానం ఉండడం సహజం. స్వాభిమానం సభ్యలక్షణమే. దీనితోపాటు తెలుగువారికి శతాధికంగా దేశాభిమానం, త్యాగశీలం, సేవానిరతి కూడా ఉన్నాయి. స్వరాజ్యంలోనే స్వరాష్ట్రం అన్నది ఆనాడు తెలుగువారి దీక్ష. అందుకే స్వాతంత్ర సమరంలో తెలుగువారి కృషి ఈ తరానికి గర్వకారణంగా నిలిచింది. చరిత్ర రాసుకోవడం స్వోత్కర్ష అవుతుందేమోనని సందేహించి ఎన్నెన్నో ముఖ్య ఘట్టాలను గ్రంథస్థం చేయకుండా వదిలేస్తున్నాం. తెలుగు నేలమీద గాంధీజీ అన్న మాటలు ఈ సందర్భంలో గుర్తొస్తున్నాయి: "మీకు (ఆంధ్రులకు) ఉండకూడనంత ఔదార్యం ఉంది. మిమ్మల్ని సరిగా నడిపించేవారు ఉంటే మీరు ఎంతటి ఆశ్చర్యకరమైన త్యాగాలనైనా చేయగలరు. ప్రశ్నించడానికి వీలు లేని

ధైర్యం మీది" అన్నారాయన. నిజమే తెలుగువారి ఔదార్యం సాటిలేనిది. దేశంలోని వివిధ రాష్ట్రాలలోనే కాదు. ప్రపంచంలోని అనేక దేశాలలో తెలుగువారు నివసిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రచురించే "డెమోగ్రాఫిక్ ఇయర్ బుక్" ఈ వివరాలను అందిస్తుంది. వీరు ఆయా ప్రాంతాల భాషలను, సంస్కృతీ సంప్రదాయాలను జీర్ణించుకుని గౌరవిస్తూ తమదైన వైలక్షణ్యాన్ని కాపాడుకుంటున్నారు.

తల్లిపాలకు, పోతపాలకు ఎంత తేడా ఉందో పరిపాలన, బోధన మాతృభాషలో జరిగితే, పరభాషలో జరిగితే అంత తేడా ఉందని ఆంధ్రోద్యమపితామహులు దేశభక్త కొండా వెంకటప్పయ్య గారు 1913 లో జరిగిన మొట్టమొదటి ఆంధ్ర మహాసభలో వెల్లడించారు.

పరిపాలన మాతృభాషలో జరగవలనంటే విద్యాబోధన కూడా మాతృభాషలో జరిగినప్పుడే పరిపాలనకు కావలసిన సిబ్బంది, పారిభాషిక పదాలు, అలవాట్లు, అవసరాలు తీర్చుకోవడానికి కావలసిన మందీ మార్బలం ఉంటుంది. వివిధ భాషల ప్రజలు ఒక ప్రాదేశిక స్థాయి కలిగి భారతదేశంలో లిపి, సాహిత్యము, వ్యక్తిత్వం, సంస్కృతి కలిగి ఉన్నారు. స్వరాజ్యము నిజమైన సురాజ్యం కావాలంటే ప్రజాస్వామికంగా నిజంగా ప్రజలరాజ్యంగా ఉండాలన్నా పరిపాలన వికేంద్రీకరణ అయి సామాన్య ప్రజలు కూడా పరిపాలనలో భాగస్వాములు కావలనంటే ప్రజల మాతృభాషలో పరిపాలన జరిగినప్పుడే జయప్రదం అవుతుంది. ఆధునిక యుగంలో వైజ్ఞానిక విప్లవం, సాంఘిక, రాజకీయ పరిణామాలు ప్రజలకు సుబోధకమై తమ జీవితంలో అన్వయించుకుని ముందు ముందు కలుగనున్న పరిణామాలను అంచెలంచెలుగా సాగించుకు పోవాలంటే సామాన్య జనంతో మమైకము, వారి భావాలతో సంలీనం, వారి నిత్యజీవితంలో చొచ్చుకుపోవడం జరిగినప్పుడే అది సాధ్యమవుతుంది. అందుకు మాతృభాషయే ధ్యేయం. ఆ ఆశయం తోటి 1926 లో ఏర్పడ్డ ఆంధ్రవిశ్వకళాపరిషత్తు శాసనములో బోధన, పరీక్షలు తెలుగులో జరగవలెనని నిర్దేశించినారు.

ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది గాని తెలుగు అధికార భాష కాలేదు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఏర్పడింది గాని బోధన తెలుగులో జరగలేదు. బిడ్డపోయినా పురిటికంపు పోలేదన్నట్లు విదేశీ పరిపాలన అంతరించినా, విదేశీ భాషపై మోజు నిత్య వ్యవహారంలో నుంచి పోలేదు. భాషను ద్వేషించడం సరికాదు. కానీ మాతృభాషకు అగ్రస్థానం ఇవ్వక అంతా పరభాషలోనే జరుపుకోదలచడం తన తల్లిని, తన భాషను మరిచిపోవడమే. ఫలితముగా తోటి సామాన్యులతో దూరం కావడమే.

ఆంధ్ర రాష్ట్రం రావడంతో తెలుగును అధికార భాషగా అమలు జరుపవలెనని ఆంధ్ర అసెంబ్లీ కర్నూలులో 29-9-1955వ తేదీన తీర్మానించింది. అమలు జరుపుటకు ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించింది. అప్పటికీ ప్రభుత్వం కొన్ని శాఖలకు తాలూకా స్థాయిలో తెలుగు అధికార భాషగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతలో విశాలాంధ్ర 1956 నవంబర్ లో ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభాధిపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారి ఆధ్వర్యంలో 1961 సంవత్సరంలో పారిభాషిక పదకోశం వెలువడింది. వావిలాల గోపాలకృష్ణయ్య పట్టుదలతో 1966లో ప్రభుత్వం శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, శ్రీ పి. వి. నరసింహారావుల పట్టుదలతో తెలుగును అధికార భాషగా శాసనం చేసింది. వెంగళరావు ప్రభుత్వం 1974 ఉగాదినాడు తాలూకా స్థాయిలో తెలుగు అధికార భాషగా నిర్ణయించింది. దీని అమలు పరిశీలన చేయడానికి ఒక అధికార కమిషన్ వావిలాల గోపాలకృష్ణయ్య ప్రథమ అధ్యక్షుడిగా ప్రభుత్వం నియమించింది. అటుపై శ్రీమతి అనసూయదేవి, శ్రీ వందేమాతరం రామచంద్రరావు, డాక్టర్ సి.నారాయణరెడ్డి, డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావు, నండూరి రామకృష్ణమాచార్య వంటి ఉద్దండులు అధ్యక్షులుగా పనిచేసిరి. 1976 ఉగాది నుండి జిల్లా స్థాయికి అమలు జరిపు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో తెలుగు బోధనా భాషగా చదివిన వారికి ప్రతి అంశానికి 5 మార్కులు అదనంగా కలుపుతూ ప్రకటించింది. రాష్ట్రంలో, జిల్లా, తాలూకా స్థాయిలో తెలుగు అమలుజరపడంతో పాటు విద్యాశాఖలోను, అధికార భాషా శాఖలోని రాష్ట్రాలలో తెలుగు అమలకు జీవోలు జారీ చేయడం జరిగింది. తెలుగురాని ప్రభుత్వ ఉద్యోగులకు తెలుగు అకాడమీ, అధికార భాష కమిషన్ల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు అధ్యయన తరగతులు నిర్వహించడం

జరిగినది. టైపు రైటింగ్ లో కూడా శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. పరిపాలనశాఖలో మూడు ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేయడం జరిగినది.

ఎన్ని ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వ ఉద్యోగుల మానసికతత్వంలో తెలుగు అమలు జరుపుకోవాలనే ఆసక్తి, అభిరుచి కలగకపోవడం విచారకరం. ప్రభుత్వాధికారులలో అట్లే ప్రభుత్వాధినేతలలో ఈ భాష అమలు జరుపవలెనని రాజకీయ ధృఢవిశ్వాసం ప్రకటనలలో ప్రస్ఫుటమైనంత అమలులో రాలేదని చెప్పక తప్పదు.

అధికార భాషగా, బోధనా భాషగా ఉండవలసిన తెలుగు భాషా స్వరూపం ఎలా ఉండాలో నిర్ణయించడానికి 1965లో పింగళి లక్ష్మీకాంతం అధ్యక్షతన ప్రభుత్వం ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ సంఘం చేసిన నిర్ణయాలు తెలుగును అధికార భాషగా చేయడానికి చాలా ఉపయోగపడ్డాయి. 1966 లో అధికార భాషా చట్టం ఆమోదం పొందింది. తర్వాత ఐదు సంవత్సరాలకు అధికార భాషా సంఘం ఏర్పాటయింది. 1968లో ప్రభుత్వం అన్ని శాఖలలోనూ తెలుగు వాడాలని మరో ఉత్తర్వు జారీ చేసింది. ఈ సంవత్సరంలోనే తెలుగు అకాడమీ స్థాపన జరిగింది. తెలుగును పరిపాలన భాషగా అమలు పరచడానికి తగిన సహాయము అందించడం, దానికి అనుగుణంగా తెలుగు భాషను ఆధునీకరించడం తెలుగు అకాడమీ లక్ష్యం. తెలుగులో పాలనా భాషగా ఉపయోగించడానికి వీలుగా పరిపాలనలో ఉన్న అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు అకాడమీ పరిపాలన న్యాయపద కోశాన్ని ముద్రించింది. పరిపాలన భాషతో పాటు న్యాయస్థాన భాష కూడా తెలుగులో ఉండేందుకు వీలైన న్యాయ పరిభాషను కూడా ముద్రించింది. వ్యాపారుల కోసం వాణిజ్యపదకోశం ప్రచురించింది. వర్ణనాత్మక వ్యాకరణం తయారుచేసి పెట్టింది. వివిధ కార్యాలయాలలో పనిచేసే ఆంధ్రేతరుల కోసం తెలుగు బోధనా తరగతులను నిర్వహించి, ఉత్తర ప్రత్యుత్తరాలు, ముసాయిదాలు, నివేదికలు రాయడానికి అవసరమైన ఆంగ్లము తెలుగుతో కూడిన కార్యాలయ పదావళిని విడుదల చేసింది. పారిభాషిక పదకోశం తయారుచేసింది. ఇన్ని చేసినా ఇంకా మన అవసరం తీరలేదు. అనుకున్నది సాధించనూ లేదు.

ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించి తెలుగు భాషాపురోభివృద్ధికి ఎంతో కృషి చేశారు. పరిపాలన రంగంలో కూడా తెలుగును అమలుపరచడానికి కృషి చేశారు. ఆంధ్రదేశంలో మహమ్మదీయ సుల్తానుల పరిపాలనా కాలములో ఉర్దూ పరిపాలనా భాషగా ఉండేది. ఆ తర్వాత ఆంగ్ల పరిపాలనా కాలంలో ఆంగ్లభాష పరిపాలనాభాషగా ఉండేది. ఇప్పుడు సహజంగా పరిపాలకుల భాష పరిపాలనా భాషగా ఉంటుంది. కానీ విచిత్రమైన విషయం ఏమిటంటే స్వాతంత్రం వచ్చి ఇంత కాలమైనా పరిపాలకులు తెలుగువారే అయినా పరిపాలనా భాష మాత్రం తెలుగు కాకపోవడం, బానిసత్వం పోయినా భాషా స్వాతంత్రం రాలేదనడానికి ఇదే నిదర్శనం. ప్రభుత్వం నిర్వహించే మాధ్యమం కార్యక్రమాలు అన్నింటిలోనూ, అధికార నిర్వహణలోనూ ఉపయోగించే భాషే పరిపాలన భాష. ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత తెలుగు భాషను అన్ని రంగాలలో అమలు చేయాలని ముఖ్యంగా కళాశాలలో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలని తీర్మానాలు చేశారు. కానీ వాటిలో చాలావరకు అమలుకు నోచుకోలేదు.

తెలుగులో మాతృభాషగా కలిగిన వారు ప్రపంచంలో సుమారు 18 కోట్ల మంది ఉన్నట్లు అంచనా. కానీ ఇందులో 33 శాతం మంది తెలుగు రాయడం, చదవడం రాని వారని తెలుస్తుంది. ఇతర రాష్ట్రాల్లోనో, విదేశాల్లోనో ఉన్నవారికి తెలుగు చదివే, రాసే అవకాశం లేకపోవచ్చు. కానీ మాతృభాష తెలుగు కలిగి ఉండి, అందులోను ఆంధ్ర రాష్ట్రంలోనే ఉంటూ తెలుగు చదవడం రాయడం రాని వారున్నారంటే ఇది మన అందరం ఆశ్చర్యపడవలసిన విషయము, చింతించవలసిన విషయం, సిగ్గుపడాల్సిన విషయం. దీనికి కారణాలు అనేకం. ఆంగ్ల విద్య మీద వ్యామోహం, వేలం వెర్రిగా పెరుగుతున్న కాన్వెంట్ చదువులు, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో చదువులు, ద్వితీయ భాషగా హిందీనో సంస్కృతాన్నో మరే ఇతర భాషలో నేర్చుకుంటే, ఇతర రాష్ట్రాలలోనూ విదేశాలలోనూ ఉద్యోగాన్వేషణకు పనికి వస్తుందన్న కారణంతోను, ఆంధ్రరాష్ట్రంలో ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులే తమ బిడ్డలకు బలవంతంగా ఇతర భాషలను నేర్పిస్తూ తెలుగును పక్కదారి

పట్టిస్తున్నారు. ఇటువంటి విషమపరిస్థితుల్లో పరిపాలనా భాషగా తెలుగును అమలుపరచడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించడం కష్టతరమే.

తెలుగు భాష తక్కిన భాషల కంటే ఎక్కువగా అన్యభాషాప్రభావానికి లోనయ్యిందనడంలో ఎటువంటి సందేహం లేదు. అందులోనూ ముఖ్యంగా ఆంగ్లభాషా ప్రభావం అత్యధికం అనేది నిర్వివాదాంశం. ఈనాడు వ్యవహారంలో ఉన్న తెలుగును పరిశీలిస్తే ఆంధ్ర రాష్ట్ర అవతరణ తరువాత ముఖ్యంగా ఈ ఆధునిక యుగములోనే తెలుగుపై ఆంగ్లభాషా ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో పరిపాలనా భాషగా తెలుగును అమలు పరచాలంటే అనేక సమస్యలు. అన్యభాషా పదాలు ముఖ్యంగా ఆంగ్లపదాలకు సమానార్థకం లేని పదాలు తెలుగు భాషలో అనేకం ఉన్నాయి. పరిపాలనా భాషగా తెలుగులో అమరపరచలేక పోవడానికి ముఖ్యమైన కారణాలు ఆధునిక విజ్ఞానాన్ని ఉపయోగించడానికి తగిన పదజాలం తెలుగులో లేకపోవడం, మాండలికాల కతీతమైన ప్రామాణిక భాష లేకపోవడం, తెలుగు వారిలో భాషాభిమానం చాలా తక్కువగా ఉండటం, ఉత్తర్వులు జారీ చేయడమే కానీ అది అమలు జరుగుతుందా లేదా అని ప్రభుత్వం పరిశీలించకపోవడం, తెలుగు భాషను చిన్నచూపు చూడటం, ప్రభుత్వ కార్యకలాపాల్లో, ఉన్నతమైన పదవుల్లో ముఖ్యంగా ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ వంటి పదవులకు తెలుగురాని ఇతర రాష్ట్రాల వారిని నియమించడం, రాజకీయ నాయకుల్లో గానీ, ప్రభుత్వ అధికారుల్లో గానీ తెలుగు భాషను అన్ని కార్యకలాపాల్లో తప్పక అమలు చేయాలనే చిత్తశుద్ధి, పట్టుదల, శ్రద్ధ లేకపోవడం. ఆంగ్లంలో మాట్లాడితే గొప్ప ప్రతిష్టగా తలచడం, ఆంగ్లభాషలో నుంచి తెలుగులోకి వచ్చి చేరిన అనేక శాస్త్ర సాంకేతిక పదజాలానికి సమానార్థకమైన తెలుగు పదజాలాన్ని రూపొందించలేకపోవడం, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు కంటే ఎక్కువగా ఆంగ్ల మాధ్యమానికే ప్రాధాన్యం ఇవ్వడం, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు తెలుగు వారి కంటే ఆంగ్లం వచ్చిన వారికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలు. వీటికి పరిష్కారాలు మనం వెతకవలసిన పనిలేదు. సమస్యలోనే సమాధానం కనబడుతుంది.

అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా మాతృభాషను గౌరవించడం, మాతృభాషలో విద్యాబోధన చేయడం జరుగుతుంది. కానీ ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం ఇది జరగడం లేదు. మాతృభాషలో విద్యాబోధన జరిగినప్పుడే పరిపాలనా భాషగా తెలుగును పూర్తిస్థాయిలో అమలుపరిచే అవకాశం వస్తుంది. రోజు రోజుకి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కాన్వెంట్ చదువులను నియంత్రించకపోగా ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నించడం శోచనీయం. ప్రస్తుత ప్రపంచీకరణ విధానంలో అంతర్జాతీయ గుర్తింపు ఉన్న ఆంగ్లభాషను నేర్చుకోవడం, దానిలో ప్రావీణ్యం సంపాదించడం తప్పనిసరే కానీ బోధనా భాషగా మాత్రం తెలుగే ఉండాలి. విద్యార్థికి మాతృభాషలో పరుత్వం ఎక్కువ ఉంటుంది. కాబట్టి విషయాన్ని చక్కగా అవగాహన చేసుకుని అన్వయించుకునే సామర్థ్యం ఉంటుంది. పొరుగున ఉన్న తమిళ, కన్నడ సోదరులను చూసి తెలుగువారు భాషాభిమానాన్ని పెంచుకోవాలి. ప్రభుత్వం అన్ని స్థాయిల పోటీ పరీక్షలలోనూ తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని మాండలికాలకు సరిపోలే, దగ్గరగా ఉండే విధంగా ఒక ప్రామాణిక భాషను రూపొందించాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, జాబులు, జవాబులు, సకల కార్యక్రమాలలోనూ తెలుగును అమలుపరిచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని వారిపై కఠిన శిక్షలు అమలుపరచాలి. ప్రతి కార్యాలయంలోనూ అంగళ్ళలోనూ, వాహనాల మీద అన్నింటిలోనూ తెలుగులో పేర్లు రాయించాలి. ఇంతకు పూర్వం ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు అన్నింటినీ తెలుగులోకి తర్జుమా చేయించాలి. అధికార, అనధికార సమావేశాల్లోనూ, సభల్లోనూ, వేడుకల్లోనూ అధికారులు, రాజకీయ నాయకులు అందరూ తెలుగులోనే మాట్లాడాలనే నియమం కఠినంగా అమలు చేయాలి. తెలుగులో మాట్లాడితే అర్థం కాని పరిస్థితిలో మాత్రమే ఆంగ్ల భాషను వాడాలి. వాక్యంలో వీలైనంతవరకు ఆంగ్ల పదాలు లేకుండా మాట్లాడటానికి ప్రయత్నం చేయాలి. తెలుగు వారు తప్ప మిగతా ఏ భాష వారైనా వీలైనంతవరకు ఆంగ్ల పదాలు వాడకుండా మాట్లాడుతారు. కాని తెలుగువారు ఎన్ని ఆంగ్ల పదాలను వాడితే అంత గొప్ప అనుకుంటారు. ఆ లక్షణం

విడిచిపెడితే తప్ప తెలుగును పరిపాలనా భాషగా సక్రమంగా అమలు జరుపలేము. తెలుగుభాషా సంస్కృతిని కాపాడటానికి, ప్రచారం చేయడానికి ఒక ప్రత్యేక శాఖను ఏర్పరచాలి. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మాతృభాషా సంస్కృతుల పట్ల అవగాహన కలగడానికి అవకాశం కల్పించాలి. ఆకాశవాణి, దూరదర్శిని, పత్రికలు వంటి ప్రసార మాధ్యమాల ద్వారా తెలుగు భాషా సంస్కృతుల్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం పొందే విధంగా చేయాలి. తెలుగు మాధ్యమంలో చదివేవారికి ప్రోత్సాహకాలను అందించాలి. మనం నిత్యవ్యవహారంలో వాడే పదాలకు తెలుగు పదాలు లేని సందర్భంలో ఆంగ్ల పదాన్నే తెలుగులో వాడుకోవాలి. ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్ వంటి అధికారులు ఇతర రాష్ట్రాల వారు అయినప్పుడు తప్పనిసరిగా తెలుగు నేర్చుకునే విధంగా చేయాలి. తెలుగును మాతృభాష కాని అధికారులందరూ తెలుగును చదవడం, రాయడం తప్పక నేర్చుకోవాలనే నిబంధన చేయాలి. ముఖ్యంగా రాష్ట్ర రాజధానిలో ప్రజలందరూ తెలుగులో మాట్లాడే విధంగా చేయాలి. ప్రభుత్వం కేవలం చట్టాలు చేయడం వల్ల ఏమీ ప్రయోజనం లేదు.

అవి సక్రమంగా అమలు జరిగేటట్లు చూడటం కూడా ప్రభుత్వం బాధ్యతే. కాని పరిపాలనా భాషగా తెలుగును పూర్తిస్థాయిలో అమలు పరచాలంటే కేవలం ప్రభుత్వం మాత్రమే చేయలేదు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరూ బాధ్యతాయుతంగా ఉండి పనిచేసినప్పుడే ఏదైనా సాధించగలం. కాబట్టి ప్రభుత్వానికి అందరూ సహకరించాలి. అధికారభాషా సంఘం, తెలుగు అకాడమీ, రాష్ట్రంలోనున్న అన్ని విశ్వవిద్యాలయాలు సంఘటితంగా కృషి చేయాలి. నాయకులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రతి తల్లి తండ్రి తమ బిడ్డ తప్పనిసరిగా తెలుగు రాయడం చదవడం నేర్చుకునే విధంగా చేయాలి. తమిళ వీరాభిమాని అయిన పూర్వపు తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి ఒక సభలో మాతృభాష గొప్పదనాన్ని గురించి చెబుతూ "మాతృభాష కళ్ళు లాంటిది, ఆంగ్లభాష కళ్ళజోడు" లాంటిది అని చక్కని ఉపమానాన్ని చెప్పారు. పుట్టుకతో ప్రతి మనిషికి కళ్ళుంటాయి. పెరిగి కొంత వయస్సు వచ్చాక అవసరాన్ని బట్టి కళ్ళజోడు పెట్టుకుంటారు. అంటే పుట్టుకతో మాతృభాష తల్లి ఒడిలో నుంచే అవసరం. తర్వాత ఆంగ్ల భాష కళ్ళజోడులో అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు. కళ్ళు లేని వాడికి కళ్ళజోడు పెట్టి ఏమి లాభం. అలాగే మాతృభాష నేర్వకుండా ఇతర భాషలు నేర్చేవారు గుడ్డివారని పోల్చి చెప్పారు. ఇది అక్షర సత్యం. దేశభాషలందు తెలుగు లెస్సగా పేరుపొంది, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా ప్రసిద్ధి చెందిన అమృతమయమైన మన తెలుగు భాషను పరిరక్షించుకోవడం తెలుగువారిగా తెలుగు గడ్డపై పుట్టిన మన అందరి బాధ్యత. "తెలుగు అనువాద గంగను" తెలుగుదేశంలో పారించాలి తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం, ఇతర విద్యాసంస్థలు ఈ భగీరథ ప్రయత్నాన్ని చేపట్టాలి.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం "2020 నూతన విద్యా విధానం" ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని ఆదేశించడం జరిగినది. రాష్ట్ర ప్రభుత్వం పట్టువిడుపు విడిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాతృభాషలో విద్యాబోధన జరగడానికి కృషి చేయాలి. ప్రస్తుతము ప్రవేశపెట్టిన నిర్బంధ ఇంగ్లీష్ మీడియం విద్యా విధానాన్ని విరమించుకోవాలి. దీనికోసం తెలుగు వారందరం ఉద్యమించాల్సిన అవసరం, అవశ్యకత ఏర్పడినది. ఇలాగే కొనసాగితే మరికొద్ది రోజుల్లో తెలుగు భాష మృత భాషల జాబితాలోకి చేరిపోతుంది.


**ఆధార గ్రంథములు:**

1. తెలుగు భాష వాడకం - అభివృద్ధి (2005), తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక - తెలుగు అకాడమీ ఇరవై ఏళ్ల శుభ సందర్భ సంచిక 1968-1988
3. తెలుగు అధికార భాష - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ (1975).
4. డాక్టర్ గోపాలకృష్ణయ్య వావిలాల (1988) - పరిపాలనా రంగంలో తెలుగు అమలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
5. రామకృష్ణారావు గోవిందరాజు (1988) - పరిపాలన రంగంలో తెలుగు అమలు పూర్వకృషి, తెలుగు అకాడమీ, హైదరాబాద్.